క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

కొమరాడ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రజావేదికను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో చేపట్టిన తనిఖీల నివేదికను ఈ ప్రజావేదికలో అధికారుల సమక్షంలో బహిర్గతం చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వేతనదారులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

బాబా భక్తుల భిక్షాటన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో జరుగుతున్న 21వ వార్షికోత్సవం, 17వ అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా బాబా భక్తులు గ్రామంలోని పలు వీధుల్లో మంగళవారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 8న స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, విశేషపూజలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంపీడీఓగా జయంత్‌ప్రసాద్

వీరఘట్టం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.జయంత్ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ఏఓగా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై వీరఘట్టం ఎంపీడీఓగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

భూముల రీసర్వే పరిశీలన

పాలకొండ రూరల్: భూముల రీసర్వే చేస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.బుచ్చయ్య కోరారు. పట్టణంలోని వీరఘట్టం రహదారిలో చేపట్టిన భూసర్వేని మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలతో సర్వే సిబ్బందిని సంప్రదించి దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు.

రైతులకు అసౌకర్యం లేకుండా భూసర్వే

గరుగుబిల్లి: రైతులకు అసౌకర్యం లేకుండా భూముల రీసర్వేను నిర్వహిస్తున్నామని రీసర్వే ఉప తహసీల్దార్ ఎన్.శివన్నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస, గొల్లవానివలస, సీమలవానివలస, సాంబన్నవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యలు తలెత్తకుండ ఉండేందుకు ఆధునిక పరికరాలతో సర్వే చేసి హద్దురాళ్లను వేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు సాంబన్నవలస, శివ్వాం, మరుపెంట, సీతారాంపురం, బీవీపురం, గంగరాజుపురం గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

పాలకొండ రూరల్: ప్రభుత్వం రాయతీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లుంబూరు సర్పంచ్ ఉపేంద్రకుమార్ అన్నారు. గ్రామంలోని ఆర్‌బీకే వద్ద మంగళవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆర్‌జీఎల్–2537, ఎంటీయూ–1061, ఎంటీయూ–1064 తదితర వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని విలేజ్ అగ్రికల్చర్ అధికారి అమిత్ పాడీ తెలిపారు.

ముందస్తు చర్యలు తీసుకోండి

పాలకొండ రూరల్: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సచివాలయ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.త్రినాథులు సూచించారు. మండలంలోని కొండాపురం, అంపిలి గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

సంఘటితంగా ఉందాం..

పాలకొండ రూరల్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు సంఘటితం కావాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బొత్స గౌరు అన్నారు. స్థానిక ఏపీఎస్ఆర్టీసీ వైఎస్సార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘ కార్యదర్శి ఆర్.రామారావు మాట్లాడుతూ సభ్యుల సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావటం ద్వారా ఉమ్మడిగా వాటిని పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. సంఘ తీర్మాణాలకు కట్టుబడి నడచుకోవాలని కోరారు. సమావేశంలో టి.మన్మధరావు, టీవీరావు, జి.గణపతి, ఎస్.రామారావు, చింజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

సీతంపేట: జాబ్‌కార్డులున్న ప్రతీ వేతనదారుడికి ఉపాధి పని కల్పించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం తెలిపారు. మండలంలోని జగ్గడుగూడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసి వేతనదారులతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అంటిజోలలో 'ఫ్యామిలీ డాక్టర్'

కురుపాం: మండలంలోని మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రజ్ఞ ఆధ్వర్యంలో అంటిజోల గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 92 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాలింతలు, పక్షవాతంతో బాధపడుతున్న పలువురు రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, భారతి, 104 సిబ్బంది సేవలందించారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

- పోషకాలతో పాటు ఔషధ గుణాలు మెండు
- పెరట్లో సాగు చేసుకోవచ్చు
- తక్కువ ఖర్చుతో ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం



చింతచిగురు



తోటకూర



కొత్తిమీర



పాలకూర

పాలకొండ రూరల్: సాధారణంగా ఆకుకూరలను ఇష్టంగా తినేవారి కంటే అయిష్టతను ప్రదర్శించేవారే ఎక్కువ. కానీ వాటిలో ఉండే పోషక విలువలు, ఔషధ గుణాలను తెలుసుకుంటే ప్రతి ఒక్కరూ వాటిని ఆహారంగా తీసుకునేందుకు ఇష్టపడతారు. ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని వైద్యులు, పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మనకు నిత్యం అందుబాటులో ఉండే తోటకూర, గోంగూర, కరివేపాకు, కొత్తిమీర తదితర ఆకుకూరల్లో పొటాషియం, సోడియం, కాల్షియం, ఐరన్, ఫోలేట్, ప్రొటీన్లు, విటమిన్లు వంటివి పుష్కలంగా లభిస్తాయి. శరీరక దృఢత్వానికి, రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. ఆయుర్వేదంలో ఆకుకూరలకు విశిష్ట ప్రాధాన్యత ఉంది.

కొత్తిమీర..

దీనిలో ఉన్న సుగంధ తైలం జీర్ణవ్యవస్థ, శ్వాసవ్యవస్థ, నాడీవ్యవస్థ, మూత్ర సంబంధ వ్యవస్థలపై ప్రభావం చూపుతాయి. ఆయా వ్యవస్థలు మెరుగ్గా పనిచేసేందుకు, అనారోగ్య సమస్యలు ఉంటే వాటిని తొలగించేందుకు ఉపకరిస్తాయి. రక్తాన్ని శుద్ధిచేసేందుకు, రక్తహీనత నివారణకు సహకరిస్తుంది.

చింత చిగురు..

బెణుకులు, వాతనొప్పులు, కీళ్లనొప్పుల నివారణకు మంచి ఔషధంగా ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్–సి గుణాలు అధికంగా ఉండటం వల్ల ఎముకల పుష్టికి సహకరిస్తుంది.

గోంగూర..

గోంగూరలో ఇనుము అధికంగా ఉంటుంది. అందుచేత ఎనీమియాతో బాధపడేవారికి మంచి టానిక్‌లా పనిచేస్తుంది. రేచీకటితో బాధపడే వారికి గోంగూర వంటకాలను పెడితే దృష్టి మెరుగవుతుంది. కాలేయానికి పుష్టిని, రక్తశుద్ధిని కలిగించే లక్షణాలు గోంగూరలో అధికంగా ఉన్నాయి. అలాగే ఈ కూరను తినడంవలన ఆకలి పుట్టడంతో పాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

పొన్నగంటికూర..

దీనిని తినడం వలన ఆకలి అధికమవ్వడంతో పాటు కఫం, వాతాలు పోగొడుతుంది. కంటి సమస్యలు దూరం చేస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లలకు ఈ కూరను తినిపించడం వలన వారిలో దృష్టి సమస్యలు త్వరగా నయమవుతాయి. అలాగే మొలల వ్యాధులను అధిగమించవచ్చు.

పాలకూర..

పాలకూర కంటికి ఎంతో మేలు చేస్తుంది. ఇది శరీరంలో త్రిదోషాలను హరిస్తుంది. అయితే 40 సంవత్సరాలు వయస్సుదాటిన వారు ఈ కూరను తక్కువగా తీసుకోవాలి. లేకుంటే కిడ్నీ సమస్యలు, కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి.

కరివేపాకు..

బాలింతలకు కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. అలాగే రోగాల నుంచి కోలుకుంటున్న వారికి కరివేపాకు పొడి చాలామంచిది. ఇది నోటికి రుచిని కలిగిస్తుంది. ఊపిరితిత్తుల వ్యాధుల నియంత్రణకు దీని పొడి మందుగా పనిచేస్తుంది. ఈ పొడిని మజ్జిగలో కలుపుకుని తాగితే కడుపులో అమీబియాసిస్‌ను పూర్తిస్థాయిలో తగ్గిస్తుంది. దీనిని పెరటిసాగుగా పండించవచ్చు.

తోటకూర..

మొలల వ్యాధితో బాధపడే వారు తోటకూర రోజూ తినడం వలన సత్ఫలితాలు లభిస్తాయి. ఈ కూరలో ఇనుము ఎక్కువగా ఉండడం వలన రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడంతో పాటు మలబద్ధకం దూరమువుతుంది. కడుపులో ఉండే విషదోషాలను హరిస్తుంది. ముఖ్యంగా మహిళల బహిష్టు సమయంలో తోటకూర వాడడం వలన అధిక రక్తస్రావాన్ని అధిగమించవచ్చు.

ఆకుకూరలతో సత్ఫలితాలు



ఆకుకూరలతో శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని ఘననీయంగా పెంచుకోవచ్చు. వీటిని పెరటి కూరల సేద్యంగా ఇంటి వద్దనే పెంచుకునే అవకాశం ఉంటుంది. శరీరానికి అవసరమైన పూర్తి పోషకవిలువలు ఆకుకూరల్లో పుష్కలంగా లభిస్తాయి. శరీరానికి అవసరమైన ఇమ్యూనిటీ వీటివలన పొందవచ్చు. క్రమం తప్పకుండా ఆకుకూరలు తినడం అన్ని విధాలా శ్రేయష్కరమని గుర్తించాలి. – జి.నాగభూషణరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, పాలకొండ

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



దుద్దుఖల్లు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికిల సూచనలు చేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని వైద్య సేవలను ప్రజలకు చేరువచేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని దుద్దుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలు, నవీకరణ చెందుతున్న యాప్‌లపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గర్భిణులు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను సకాలంలో గుర్తించినట్లయితే సరైన చికిత్స అందించేందుకు వీలుంటుందన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న ఐడీసీఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌లను అవసరమైన అన్ని చోట్ల ఏర్పాటు చేసి డయేరియా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఇ–ఆశా యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని సూచించారు. గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముందస్తు సమాచారాన్ని గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బీవీఎస్ స్వాతి, ఎం.వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు రమణ, శ్రీనివాస్, సుగుణ, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్థానిక ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక వంద పడకల ఆస్పత్రిలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పేదలకు సకాలంలో వైద్యం అందించాలనే ఉద్దేశంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువచ్చిందని వివరించారు. ఇందులో భాగంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది మంచి సేవలు అందించాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ ఆస్పత్రి వద్ద ప్రహరీ, మెయిన్ గేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు పలు అంశాలను సమావేశం ముందు ఉంచగా కమిటీ ఏకగ్రీవంగా తీర్మాణించి ఆమోదించింది. సమావేశంలో నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఆర్ఎంఓ జె.రవీంద్రకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు



శివ్వాంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ రామకృష్ణ

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనులను రైతులకు ఉపయోగపడేలా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఏపీఓ టి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని శివ్వాం, గొట్టివలస, ఉల్లిభద్ర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా పిల్లకాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నట్ల చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కాలువాల్లో పిల్లకాలువలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వేతనదారులకు సగటు వేతనం వచ్చేలా పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయండి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: అన్ని విభాగాల్లో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆదేశించారు. స్థానిక ఐటీడీఏలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర రిపోర్టులు రూపొందించాలన్నారు. అటవీ సాగుహక్కు పత్రాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను గిరిభూమి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అటవీశాఖ సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయశాఖకు సంబంధించి ఈ–క్రాప్ అప్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రైతుభరోసా పెండింగ్ పేమెంట్స్‌ను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, డీడీ నగేష్, డీహెచ్ఓ సత్యనారాయణరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, పీఏఓ హరికృష్ణ, పశువైద్యశాఖ ఏడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఆర్‌సీ ఓఎస్‌డీ బదిలీ

సీతంపేట: స్థానిక పీఎంఆర్‌సీ ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ ఎం.యుగంధర్‌కు బదిలీ కావడంతో పీఓ కల్పనాకుమారి మంగళవారం ఆయన్ను విధుల నుంచి రిలీవ్ చేశారు. మల్లి సీవోఈ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, ఓఎస్‌డీగా అడిషనల్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం భద్రగిరి గిరిజన గురుకుల బాలుర కళాశాలకు బదిలీ అయ్యారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

పాలకొండ: పింఛను పొందుతున్న వారు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సబ్‌ట్రజరీ ఎస్‌టీఓ భాస్కరరావు సూచించారు. ఈకేవైసీ చేయించుకోకపోతే పింఛన్ నిలిచిపోతుందని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఇంటర్నెట్ సెంటర్లు, ఈ–సేవ కేంద్రాల్లో, లేదా సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. సబ్‌ట్రజరీ కార్యాలయం పరిధిలో ఇంకా 500 మందివరకు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వారంతా వారం రోజుల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యంపై దృష్టిసారించాలి

భామిని: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం 'ఆశా డే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో వైద్యాధికారి ఎన్.ఫణికుమార్ సమావేశమై ప్రజలకు అందించాల్సిన ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అనంతరం దోమల నివారణపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కరరావు, హెచ్‌వీలు గౌరీశ్వరి, మరియ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఉల్లిభద్ర గ్రామ సచివాలయం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు చేతులమీదుగా బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉరిటి రామరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రూ.45 లక్షల అంచనాతో నిర్మించిన ఈ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత మెరుగ్గా ప్రభుత్వ సేవలు అందించేందుకు అవకాశం ఉందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాం..



రామినాయుడువలసలో మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలస సచివాలయం పరిధిలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జోగిరాజుపేట, పెద్దవలస, రామినాయుడువలస గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇంకా ఎవరికైనా అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందనట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు మరడాన మధుసూదనరావు, మరడాన కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: తపాలా జీవిత బీమా, పొదుపు పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని పి.ఆమిటి బీపీఎం, తపాలా శాఖ ఉద్యోగుల సంఘం డివిజనల్ కార్యాదర్శి రవికుమార్ అన్నారు. తపాలా శాఖ ద్వారా ప్రతి ఒక్కరికీ పొదుపు పథకాలు/జీవిత బీమా అందించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న 'వన్ జన్ ధన్' (గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పి.ఆమిటి పోస్టాఫీస్ పరిధిలోని గోపాలపురం, పి.ఆమిటి, కారివలస, మొరమగూడ గ్రామా ల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పలు సేవింగ్ స్కీములు, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 2023 ఆగస్టు 9 వరకు చిన్నమొత్తాల పొదుపు పథకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఇందులో చేరి స్కీమ్ ప్రయోజనాలు పొందాలని కోరారు.

పట్టా భూములను గిరిజనులకు అప్పగించాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని బొడ్డవలస గిరిజనుల పట్టాభూములు తిరిగి వారికి అప్పగించాలని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జియ్యమ్మవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 9లో బొడ్డవలసకు చెందిన గిరిజనులు కె.చంద్రయ్య, కె.తమ్మయ్య, కె.పగడాలు, నిమ్మక పెంటయ్యకు నాలుగెకరాల డీపట్టా భూమి ఉందని, ఆ భూమిని సర్వేచేసి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గత 40 సంతవ్సరాలుగా ఆ భూమి వారి సాగు ఆధీనంలోనే ఉందని, ఇటీవల కొందరు గిరిజనేతరులు దీనిపై పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో వివాదాస్పదంగా మారిందన్నారు. సమగ్ర సర్వే చేసి నిజమైన పట్టాదారులకు ఆ భూమిని అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.సీతారం, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



శివకుమార్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైద్యాధికారి బుద్దేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కేదారిపురం సెక్షన్‌లో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పత్తిక శివకుమార్ ఇటీవల మృతి చెందడంతో పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.90 వేలు విరాళాలు సేకరించి వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు చేతులమీదుగా మంగళవారం శివకుమార్ భార్య దీపకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. శివకుమార్ కుటుంబానికి తోటి ఉద్యోగులంతా అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సింహాచలం, సూపర్‌వైజర్లు శ్రీను, ఎర్రయమ్మ, సింహాచలం, హెల్త్ అసిస్టెంట్లు నిమ్మకూరి రత్నప్రసాద్, ఎస్.వి.ప్రకాష్, బి.లక్ష్మణ, ఏఎన్ఎంలు ఎం.ప్రభావతి, అర్చన్, ధనలక్ష్మి తదితరులున్నారు.

12న విత్తన మహోత్సవం

గుమ్మలక్ష్మీపురం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంలో ఈనెల 12న నిర్వహించే విత్తన మహోత్సవానికి రైతులంతా హాజరుకావాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ విత్తన మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు హాజరవుతారని వెల్లడించారు. వీరంతా ఆధునిక సాగు పద్ధతులు, సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే వరి, కంది, మినుములు, పెసర, శనగ, వేరుశనగ, నువ్వులు, రాగులు, కొర్ర, జొన్న మొదలగు విత్తనాలతో పాటు నూతన రకాల విత్తనాలను విక్రయానికి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.